

సస్యశ్యామలం చేస్తా

గోదావరి నీళ్లతో ఆలేరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పేర్కొన్నారు. - 9లో



అక్రమ నిర్మాణాల తొలగింపు


భువనగిరి, యాదగిరిగుట్ట మున్సిపాలిటీల్లో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. - 9లో



గుంతలమయం

రామన్నపేట మండలం పరిధిలో చిట్యాల - భువనగిరి రహదారిపై అడుకో గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. 9లో

ఎంజీయూ వీసీగా అల్తాఫ్ హుస్సేన్



అల్తాఫ్ హుస్సేన్

- గతంలో మూడేళ్లపాటు ఇక్కడే వీసీగా విధులు
- అప్పట్లో యూనివర్సిటీలో పలు సంస్కరణలు

ఎంజీయూ (నల్లగొండ రూరల్) : మహాత్మాగాంధీ యూనివర్సిటీ నూతన వీసీగా అల్తాఫ్ హుస్సేన్ శుక్రవారం నియమితులయ్యారు. ఈయన 2016 జూలై 2 నుంచి 2019 జూన్ 19 వరకు ఎంజీయూలో వీసీగా సేవలందించారు. ఆకాలంలో ఎంజీయూలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి అమలు చేశారు. అప్పట్లో విద్యార్థులు, అధ్యాపకులకు బయోమెట్రిక్ విధానం అమలు చేశారు. విద్యార్థులు రెగ్యులర్‌గా తరగతులకు వస్తేనే విజ్ఞానం పెరుగుతుందని భావించి బయోమెట్రిక్ అమలు పర్చారు. అప్పట్లో 300 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. వారికి మరోసారి పరీక్ష రాసేందుకు అవకాశం ఇచ్చారు. 2016–2019 మధ్య కాలంలో యూనివర్సిటీ అభివృద్ధికి పెద్దపీట వేసి న్యాక్ అక్రిడిటేషన్‌కు నాయకత్వం వహించి బీ గ్రేడ్ సాధనకు కృషి చేశారు. యూనివర్సిటీ ఇంటర్నల్ నిధులతో ఇంజినీరింగ్ కళాశాల, స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాల బాలికలకు అదనపు హాస్టల్, పరీక్షల బ్రాంచ్ భవనాలకు శంకుస్థాపన చేశారు. నేడు ఈ భవనాలు అందుబాటులోకి వచ్చాయి.

31 మంది అధ్యాపకుల తొలగింపునకు నోటీసులు..

అక్రమంగా నియమితులైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 31 మంది అధ్యాపకులను తొలగిస్తూ అప్పట్లో నోటీసు ఇచ్చారు. ఆ తరువాత వారంతా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొని గతంలో పనిచేసిన వీసీలను ప్రసన్నం చేసుకుంటూ అధ్యాపకులుగా కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం ముందుకు సాగే వీసీ అల్తాఫ్ హుస్సేన్ వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో అనే విషయంపై యూనివర్సిటీలో చర్చ సాగుతోంది.

> **విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తాం**
>
> మహాత్మాగాంధీ యూనివర్సిటీ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తాం. బ్లూప్రింట్ తయారు చేసి విద్య, అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతా. జిల్లా అవసరాలు, విద్యార్థుల భవిష్యత్‌కు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుని వారిని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతాం.
>
> - అల్తాఫ్ హుస్సేన్, వీసీ

న్యూస్‌రీల్

నేడు రామన్నపేటకు హైకోర్టు న్యాయమూర్తులు

రామన్నపేట : హైకోర్టు న్యామూర్తులు జస్టిస్ జువ్వాది శ్రీదేవి, జస్టిస్ కూనూరు లక్ష్మణ్‌లు శనివారం రామన్నపేటకు రానున్నారు. రామన్నపేటకు కొత్తగా మంజూరైన సీనియర్ సివిల్ జడ్జి (సబ్‌కోర్టు) కోర్టును వారు ప్రారంభించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ అబ్దుల్ మజీద్ తెలిపారు.

గ్రూప్–3కు పటిష్ట ఏర్పాట్లు

సాక్షి,యాదాద్రి : గ్రూప్–3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. నవంబర్ 17,18 తేదీల్లో జరిగే గ్రూప్–3 పరీక్షలను పురస్కరించుకుని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషనర్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, నోడల్ అధికారులు, పోలీసులు అధికారులు, సమన్వయ కర్తలతో పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా యాదాద్రి జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ వివరించారు. జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నామని, 6,216 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. పరీక్షలు పారదర్శకంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

ఉత్తమ యాజమాన్యంతో అధిక దిగుబడులు



పత్తి చేనును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్

మోటకొండూర్ : పంటల సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంభించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ రైతులకు సూచించారు. శుక్రవారం మోటకొండూరు మండలం తేర్యాల గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలను పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలు చేశారు. అందుబాటులోకి వస్తున్న ఆధునిక విధానాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవరకొండ శివాణీ, సురేష్, రైతులు బొంగు పుల్లయ్య, రాజు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకే అప్పగించాలి

భువనగిరి టౌన్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల బాధ్యతలను స్థానికంగా ఉండే భవన నిర్మాణ కార్మికులకు అప్పగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు కోరారు. శుక్రవారం భువనగిరిలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల కార్మికులు జిల్లాలో తక్కువ కూలికి పని చేస్తున్నారని, దీంతో స్థానికగా ఉన్న భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించి జీవనోపాధి కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్, సహాయ కార్యదర్శి గనబోయిన వెంకటేష్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, పుట్ట రమేష్, జిల్లా కమిటీ సభ్యులు దాసరి లక్ష్మయ్య, చొప్పరి సత్తయ్య, వల్దాస్ నర్సింహ, పాపగళ్ల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతలను కలిసిన ‘రీజినల్’ బాధితులు



బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చి తమకు న్యాయం చేయాలని కోరుతూ రీజినల్ రింగ్ రోడ్డు బాధితులు శుక్రవారం బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, ఉప నాయకుడు వెంకటరమణారెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. నిబంధనల ప్రకారం ఔటర్ రింగ్‌రోడ్డుకు రీజినల్ రింగ్ రోడ్డు 40 కిలో మీటర్ల దూరంలో ఉండాలని, చౌటుప్పల్, రాయగిరి ప్రాంతాల్లో 28 కి.మీకు కుదించారని తెలిపారు. కుదించిన క్రమంలో జంక్షన్ల నిర్మాణంలో తమ ప్రాంతాలు రెండుగా విడిపోతున్నాయని తెలిపారు. అంతేకాకుండా కోట్లాది రూపాయల విలువైన భూములతో పాటు ప్లాట్లు, నివాస గృహాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు.

చెరువులు ఉన్నాయా..!

హెచ్ఎండీఏ పరిధిలోని మండలాల్లో కొనసాగుతోన్న సర్వే

- 45 ఏళ్ల డేటా ఆధారంగా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణ
- ఇప్పటి వరకు 57 చెరువుల సర్వే పూర్తి
- చెరువుల పరిరక్షణకు పూనుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- నిర్మాణాలు చేపట్టిన వ్యక్తుల్లో ఆందోళన



భువనగిరి మండలం ముస్త్యాలపల్లిలో తుర్కవానికుంటను సర్వే చేస్తున్న అధికారులు

సాక్షి,యాదాద్రి : చెరువుల సర్వేతో అక్రమార్కులు వణికిపోతున్నారు. హెచ్ఎండీఏ మండలాల్లోని చెరువుల ఆక్రమణపై నిగ్గు తేల్చాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో అధికారులు సర్వేకు పూనుకున్నారు. చెరువులు యథాస్థితిలో ఉన్నాయా.. ఆక్రమణకు గురయ్యాయా? ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎవరైనా నిర్మాణాలు చేశారా? గుర్తిస్తున్నారు. సర్వే నివేదికను ఏరోజుకారోజు హెచ్ఎండీఏకు అందజేస్తున్నారు. సర్వే పూర్తయిన అనంతరం అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేసిన వ్యక్తులు వణికిపోతున్నారు.

ఆక్రమణలను ఇలా గుర్తిస్తున్నారు

45 ఏళ్ల డేటా ఆధారంగా చెరువులకు సంబంధించిన పూర్తిస్థాయి నీటిమట్టం (ఫుల్‌ట్యాంక్ లెవల్ – ఎఫ్‌టీఎల్)ను గుర్తించడంతో పాటు గరిష్టంగా నీరు విస్తరించే ప్రాంతం(మ్యాగ్జిమమ్ వాటర్ స్ప్రెడ్ ఏరియా)ను తేల్చడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఎన్ఆర్ఎస్ఏ, స్టేట్ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్, ఇరిగేషన్ విభాగాల డేటాను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. మ్యాప్స్, ల్యాండ్ యూజ్ సర్వే నంబర్లతో సహా సమాచారం ఇచ్చే క్యాడస్ట్రల్ మ్యాప్స్, 45 ఏళ్లలో పూర్తిస్థాయిలో చెరువు నీరు విస్తరించిన తీరుపై సమాచారం సేకరిస్తున్నారు.

మొత్తం చెరువులు, సర్వే పూర్తయినవి

యాదాద్రి జిల్లాలోని భువనగిరి, బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్, బొమ్మల రామారం మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. ఆయా మండలాల్లో 244 చెరువులను గతంలోనే సర్వే చేయాలనుకున్నా ముందుకు సాగలేదు. చెరువులు ఆక్రమణకు గురయ్యాయని ఆరోపణలు ఉండడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, నీటి పారుదల శాఖలు రంగంలోకి దిగాయి. ఐదు మండలాల్లో సర్వే నిర్వహించడానికి ఐదు బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఆగస్టు చివరిలో సర్వే ప్రారంభించాయి. నవంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 57 చెరువుల సర్వే పూర్తయ్యింది. వారంలో రెండు చెరువుల చొప్పున సర్వే కొనసాగుతోంది. సర్వే పూర్తయిన అనంతరం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణదారులకు నోటీసులు జారీ చేయనున్నారు. ప్రస్తుతానికి వివాదాస్పద, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న చెరువుల జోలికి వెళ్లడం లేదు.

> **పెద్ద ఎత్తున నిర్మాణాలు**
>
> భువనగిరి, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, బొమ్మలరామారం మండలాల పరిధిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో పెద్ద ఎత్తున నిర్మాణాలు వెలిశాయి. వాటికి ముప్పుతప్పదన్న చర్చ నడుస్తోంది. అందులో పేద, మధ్య తరగతి వర్గాలు కూడా ఉన్నాయి. వారంతా ఆందోళన చెందుతున్నారు. కొత్తగా నిర్మాణాలు చేయడానికి మరెవ్వరూ ముందుకు రావడం లేదు. మరోవైపు చెరువుల సర్వే రియల్ ఎస్టేట్ వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరిట హైదరాబాద్‌లో కూల్చివేతలు జరుగుతుండడంతో జిల్లా రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. తాజాగా చేపడుతున్న చెరువుల సర్వేతో రియల్టర్లు బెంబేలెత్తిపోతున్నారు.

సరైన చికిత్స అందిస్తేనే ప్రయోజనం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఏడీపీహెచ్ఓ, డాక్టర్లు, సైక్రియాటిస్టులు

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : మానసిక ఆందోళన, ఒత్తిడిలో ఉన్న వ్యక్తులకు సరైన సమయంలో సరైన చికిత్స అందిస్తేనే ప్రయోజనం ఉంటుందని కలెక్టర్ హనుమంతు కే.జండగే వైద్యులకు సూచించారు. మానసిక ఆరోగ్య మాసోత్సవంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీలకు మానసిక ఆరోగ్యంపై శుక్రవారం కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మానిసిక ఆందోళన, ఒత్తిడి, హైపర్ టెన్షన్, డయాబెటిక్ పేషెంట్లను గుర్తించి సకాలంలో చికిత్స చేయడంతో పాటు మందులు అందజేయాలని పేర్కొన్నారు. 14416 టోల్ ఫ్రీ నంబర్‌ను అందరికీ అందుబాటులో ఉంచాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద మాట్లాడుతూ వైద్యాధికారులు తమ పరిధిలో ఉన్న వ్యక్తులకు మానసిక ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలని కోరారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రీతి స్వరూప్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో అందుబాటులో ఉంటారని వారిని సంప్రదించి చికిత్స ఇప్పించాలని పేర్కొన్నారు. అనంతరం మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీపీహెచ్ఓ మనోహర్, డాక్టర్లు రామకృష్ణ, శిల్పిని, సాయిశోభ, సుమన్‌కళ్యాణ్, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ సత్యేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఉద్యానవన అధికారులు, ఆయిల్‌ఫెడ్ కంపెనీ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని సూచించారు.

‘పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలపై అవగాహన కల్పించండి

భువనగిరిటౌన్ : పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పథకాల గురించి వివరించారు.

> **గుండాల ఆదర్శ పాఠశాల తనిఖీ**
>
> గుండాల : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పోటీతత్వంతో చదువు కొనసాగించాలని, ఉన్నతులుగా ఎదిగి తల్లిదండ్రుల కల సాకారం చేయాలని సూచించారు. అందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని కోరారు. అమ్మ అదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ జలకుమారి, ప్రిన్సిపాల్ రాము ఉన్నారు.

సిమెంట్ పరిశ్రమకు అనుమతి ఇవ్వద్దు



పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న కొమ్మాయిగూడెం గ్రామస్తులు

- కొమ్మాయిగూడెం గ్రామస్తుల ధర్నా

రామన్నపేట : కొమ్మాయిగూడెం, రామన్నపేట పరిసరాల్లో ఏర్పాటు చేయతలపెట్టిన అంబుజా సిమెంట్ పరిశ్రమను అంగీకరించబోమని కొమ్మాయిగూడెం గ్రామస్తులు స్పష్టం చేశారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనకు వ్యతిరేకంగా శుక్రవారం గ్రామంలో ఆందోళన చేపట్టారు. సరుకుల గోదాములు కడతామని చెప్పి భూములు కొనుగోలు చేశారని, జనావాసల సమీపంలో పరిశ్రమల పెడతామంటే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, అఖిలపక్ష నాయకులు గురజాల అంజిరెడ్డి, బాలగోని గణేష్, ఎర్ర కాటమయ్య, శానగొండ వెంకటేశ్వర్లు, ఎర్ర రమేష్, మోటె మారయ్య, బుర్ర శ్రీశైలం, బెల్లి లింగస్వామి, బత్తుల సత్తయ్య, బెల్లి మల్లయ్యాల్గొన్నారు.

అదనపు కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు వినతి

సిమెంట్ పరిశ్రమకు అనుమతి ఇవ్వదంటూ పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు శుక్రవారం అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు వినతిపత్రం అందజేశారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తే 12 గ్రామాలకు చెందిన 30వేల మంది ఆరోగ్యం, పంటచేలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. అదేవిధంగా నల్లగొండలోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీల మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పల్లపు దుర్గయ్య, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు పోచబోయిన మల్లేశం, బొడ్డుపల్లి వెంకటేశం, ఊట్కూరి నర్సింహ, పర్యావరణ పరిరక్షణ కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎండీ రెహాన్, గోదాసు పృథ్వీరాజ్, నాగటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రద్దు!

మరో ప్రాంతానికి మోత్కూరు, రామన్నపేట కార్యాలయాల తరలింపు

- తక్కువ రిజిస్ట్రేషన్లు, సిబ్బందికి పనిలేకపోవడమే కారణం
- పునర్వ్యవస్థీకరణలో భాగంగా నిర్ణయం తీసుకున్న రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ



రద్దు కానున్న మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



రామన్నపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మోత్కూరు, రామన్నపేట : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మోత్కూరు, రామన్న పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు రద్దు కానున్నట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్లు, సిబ్బందిపై పనిభారం, ఇతర కార్యకలాపాల ప్రాతిపదికన స్టాంపు, రిజిస్ట్రేషన్ల శాఖ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన ప్రారంభంలోనే రాష్ట్ర వ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణకు ఆ శాఖ శ్రీకారం చుట్టింది. కానీ, వివిధ కారణాల వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయింది.

కారణాలు ఇవీ..

ధరణి వచ్చిన తరువాత వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు తహసీల్దార్ కార్యాలయాల్లో జరుగుతున్నాయి. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కేవలం వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్లకే పరిమితమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 141 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. వాటిలో 21నుంచి 23 చోట్ల తక్కువ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, తద్వారా సిబ్బందికి పని ఉండడం లేదని ఉన్నతస్థాయి సమీక్షలో గుర్తించారు. ఈ నేపథ్యంలో పూర్తిగా గ్రామీణ ప్రాంతాలతో ముడిపడి ఉన్న 20 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రద్దు చేసి, రిజిస్ట్రేషన్లు ఎక్కువ జరిగే చోట ఏర్పాటు చేయాలని ఆ శాఖ భావిస్తోంది. అందులో మోత్కూరు, రామన్నపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కూడా ఉన్నాయి.

> **రూ.70 లక్షలతో సొంత భవనం**
>
> మోత్కూరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కోసం పదేళ్ల క్రితం సుమారు రూ.70 లక్షలతో సొంత భవనం నిర్మించారు. ఈ భవనాన్ని అప్పటి ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ ప్రారంభించారు. మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోకి మోత్కూరుతో పాటు ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు, రామన్నపేట సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని రామన్నపేట, వలిగొండ మండలాలు వస్తాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రద్దు చేస్తారన్న ప్రచారంతో ఆయా మండలాల పరిధిలోని ప్రజల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది. కార్యాలయాలను కొనసాగించాలని కోరుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మోత్కూరు, రామన్నపేటతో పాటు చండూరు, నిడమనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

భోజనం వడ్డించి.. సమస్యలు తెలుసుకుని



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జెడ్పీ సీఈఓ

- తూప్రాన్‌పేట రెసిడెన్షియల్ స్కూల్‌ను తనిఖీ చేసిన జెడ్పీ సీఈఓ శోభారాణి

చౌటుప్పల్ రూరల్ : చౌటుప్పల్ మండలంలోని తుప్రాన్‌పేట సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్‌ను శుక్రవారం జెడ్పీ సీఈఓ శోభారాణి తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆమె పాఠశాలను సందర్శించారు. వంట గది, భోజనశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. బోధన ఎలా ఉందని అరా తీశారు.అర్థమయ్యేరీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించారు. వారితో కలిసి భోజనం చేస్తూ సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలకు సొంత భవనం లేదని, ప్రహరీ కూడా నిర్మించకపో వడంతో రక్షణ లేకుండాపోయిందని, కిటికీలు అధ్వానంగా ఉన్నాయని విద్యార్థులు జెడ్పీ సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులకు సరిపడా దుప్పట్లు లేకపోవడానికి జెడ్పీ సీఈఓ గుర్తించారు. సమస్యను పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

పంచాయతీరాజ్ ఏఈపై ఆగ్రహం

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీరాజ్ ఏఈ వై.నితీష్‌కుమార్‌పై జెడ్పీ సీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌటుప్పల్ మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సమయంలో ఏఈ విధుల్లో లేరు. సిబ్బందిని అడగగా విధులకు వచ్చి బయటకు వెళ్లినట్లు చెప్పారు. బయటకు వెళ్తున్నట్లు టూర్ డైరీలో రాయకపోవడం, రిజిస్టర్‌లో సంతకం కూడా చేయకపోవడాన్ని ఆమె గమనించారు. మోమో జారీ చేయాలని ఇంచార్జి ఎంపీడీఓను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తు సహించబోమని హెచ్చరించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహా స్వామి క్షేత్రంలో శుక్రవారం ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా చేపట్టారు. ఈ సందర్భంగా అండాళ్‌దేవిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అనంతరం అద్దాల మండపంలో అధిష్ఠింపజేసి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. అదే విధంగా ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి.

విద్యార్థుల ప్రతిభకు వేదిక.. కళాఉత్సవ్

- డీఈఓ సత్యనారాయణ

భువనగిరి : చదువుతో పాటు కళల్లో రాణిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు కళాఉత్సవ్ వేదికగా నిలుస్తుందని డీఈఓ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం భువనగిరిలోని వెన్నెల కళాశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కళాఉత్సవ్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కళాఉత్సవ్ పోటీల్లో సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కళలు, ప్రజలను చైతన్యపరిచే కళలను ప్రదర్శించేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కళా రంగంలోనూ రాణించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించి సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఇంచార్జి శ్రీనివాస్, రజనీ, రామారావు, రమేష్, శ్రీనివాస్, మురళీ, ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

కళాఉత్సవ్ సందర్భంగా నిర్వహించిన గాత్ర సంగీతం, నృత్యం, సంగీత వాయిద్యం, చిత్రలేఖనం, కథలు చెప్పడం, నాటిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వీరిలో చౌటుప్పల్ బాలికల రెసిడెన్సియల్ స్కూల్‌కు చెందిన వి.సిరి, భువనగిరిలోని బాలుర రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల, వలిగొండ మండలం వెల్వర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

క్లుప్తంగా

మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డుకు ఎంపిక


కోడి శ్రీనివాసులు

చండూరు : పట్టణానికి చెందిన గాంధీజీ ఫౌండేషన్, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు మహాత్మా గాంధీ శాంతి పురస్కారం -2024 (తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో) మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డుకు ఎంపికయ్యారు. అవార్డును ఈ నెల 22న హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో ఆయన అందుకోనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడి శ్రీనివాసులు మాట్లాడుతూ తాను గాంధీజీ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకుగాను ఈ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్‌కు గాయాలు


నామవరపు అనిల్

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన హుజూర్‌నగర్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన నామవరపు అనిల్ గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. కాగా శుక్రవారం గ్రామంలోని అయ్యప్పస్వామి గుడి దగ్గర విద్యుత్ స్తంభంపై విద్యుత్ సమస్య తలెత్తడంతో అసిస్టెంట్ లైన్‌మెన్ రాంబాబు అనిల్‌ను తీసుకెళ్లాడు. అనిల్ విద్యుత్ స్తంభం ఎక్కి తీగలకు మరమ్మతులు చేస్తుండగా పైనుంచి వెళ్తున్న 11 కేవీ వైర్ల ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనుంచి కిందపడ్డాడు. దీంతో అతడి వెన్నెపూసకు, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. అనిల్‌ను వెంటనే హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట) : నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిపై అకారణంగా దాడిచేసి గాయపర్చిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రత్నావత్ శంకర్‌నాయక్ తెలిపారు. ఆత్మకూరు (ఎస్) మండల పరిధిలోని కోటినాయక్ తండాలో గురువారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ధరావత్ సైదాపై అదే గ్రామానికి చెందిన ధరావత్ రాజు, ధరావత్ రాహుల్, బాబోత్ రాజేష్‌లు అకారణంగా దాడి చేసి గాయపరిచారు. సైదా తలకు గాయాలు కావడంతో బంధువులు సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. సైదా భార్య జ్యోతి శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు శంకర్‌నాయక్ తెలిపారు.

దాతలు ఆదుకుంటేనే గండం గడిచేది !

- విద్యుత్ స్తంభం పైనుంచి పడి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌కు తీవ్ర గాయాలు
- హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సైదులు
- ఉన్న ఇంటిని తాకట్టు పెట్టి వైద్యం చేయిస్తున్న భార్య
- రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబం
- ఆర్థికసాయం కోసం ఎదురు చూపులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సైదులు

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రానికి చెందిన ఓ నిరుపేద కుటుంబానికి పెద్దకష్టం వచ్చింది. రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. మునగాల మండల కేంద్రంలోని హరిజన కాలనీకి చెందిన లంజేపల్లి సైదులు ప్రైవేటుగా ఎలక్ట్రీషియన్ పనులతోపాటు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సైదులుకు భార్య మహేశ్వరి, ఐదేళ్లలోపు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన సైదులు.. స్వశక్తి మీద కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా ఈ నెల 9వ తేదీన గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామంలో వీధిలైట్లు అమర్చేందుకు సైదులు కూలి పనికి వెళ్లాడు. విద్యుత్ స్తంభం ఎక్కి లైట్లు వేస్తుండగా పక్కనే వున్న 11కేవీ విద్యుత్ వైర్ల ద్వారా షాక్ రావడంతో సైదులు స్తంభం పైనుంచి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు, గ్రామపంచాయతీ సిబ్బంది హుటాహుటిన చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం భార్య హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది.

రోజుకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు ఆస్పత్రి ఖర్చు

వారం రోజులుగా సైదులుకు ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతోంది. సైదులుకు చికిత్స చేయించేందుకు గ్రామంలో ఉన్న చిన్న ఇంటిని తాకట్టు పెట్టి రూ.రెండు లక్షలు అప్పు తెచ్చారు. ఇప్పటి వరకు రూ.నాలుగు లక్షలు ఖర్చు చేసినట్లు భార్య మహేశ్వరి తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఇంకా రూ.రెండు లక్షలు ఇవ్వాల్సి ఉంది. రోజుకు రూ.30 నుంచి రూ.40వేల వరకు చికిత్సకు అవుతోందని భార్య తెలిపింది. దయగల వారు తమకు తోచిన విధంగా ఆర్థికసాయం అందించి తన భర్త ప్రాణాలు కాపాడాలని సైదులు భార్య మహేశ్వరి కోరుతోంది.

నా భర్త ప్రాణాలు కాపాడండి



నా భర్త వారం రోజుల క్రితం విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలై హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం ఇప్పటికే ఉన్న ఇల్లు తాకట్టు పెట్టి రూ.రెండు లక్షల అప్పు తెచ్చాను. ఇప్పటివరకు రూ.4లక్షలు చికిత్స కోసం ఖర్చు చేశాం. అయినప్పటికీ ఇంకా కోలుకోలేదు. ప్రస్తుతం నావద్ద చిల్లిగవ్వ కూడా లేదు. దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేసి నా భర్త ప్రాణాలు కాపాడాలి.
–మహేశ్వరి, సైదులు భార్య

ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నప్పటికీ..

సైదులు కుటుంబానికి ఆరోగ్యశ్రీ కార్డు ఉంది. ఆరోగ్యశ్రీ వర్తించే ఆస్పత్రిలో చేర్పించాలంటే ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఆస్పత్రిలో పూర్తి బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. తన భర్త ప్రాణాలు కాపాడేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని మహేశ్వరి వేడుకుంటోంది.

సైదులకు సాయం చేయాలనుకునేవారు ఈ కింది నంబర్లకు ఫోన్‌పే చేయవచ్చు
ఫోన్‌పే నంబర్ 99895 92943
(సాల వీరబాబు, స్నేహితుడు)
93919 64512 (లంజేపల్లి రవి, స్నేహితుడు)

ప్రతిపక్షాలకు గుణపాఠం చెప్పాలి

- మూసీ ప్రక్షాళన అడ్డుకుంటామనడం అవివేకం
- కేటీఆర్ తెలివికలవాడే కానీ.. ఆయన తీరు సరిగాలేదు
- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి


మాట్లాడుతున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటామంటున్న ప్రతిపక్ష పార్టీలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు గుణపాఠం చెప్పాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా ప్రజలు బాగుపడాలంటే మూసీ ప్రక్షాళన జరగాలన్నారు. మూసీ ప్రక్షాళనకు మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి హయాంలోనే బీజం పడిందని గుర్తుచేశారు. మూసీ ప్రక్షాళనకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధి అంతా మూసీ నీళ్లతో వ్యవసాయం చేస్తున్నారని, ఏ పంటలు వేసినా తినలేని పరిస్థితి ఉందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ తెలివి కలవాడని, ఆయన ప్రదర్శిస్తున్న తీరు సరికాదన్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా ఉండి 50 అంతస్తులకు అనుమతులు ఇచ్చింది ఆయనేనని అన్నారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా తన గతాన్ని చూసుకోవాలని హితవు పలికారు. మూసీని ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు విమర్శిస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. మొదట మూసీ గర్భంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ఆ తరువాత ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న వాటిని తొలగించాలని ప్రభుత్వానికి సూచించారు. మూసీ ప్రక్షాళనలో ఇల్లు పోయే వాళ్లకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తుంటే ఇంకేం నష్టమన్నారు. హైదరాబాద్‌లో 50 మీటర్ల లోతు సెల్లార్లు తవ్వి ఆ మట్టిని మూసీలో, చెరువుల్లో పోస్తున్నారని, దీనిపై హైడ్రా దృష్టి సారించాలన్నారు. ఈ మట్టి పోయడం ద్వారనే చెరువులు మాయం అవుతున్నాయని తెలిపారు. దేశ భద్రత కోసం వికారాబాద్‌లో పెట్టే నేవీ రాడార్ విషయంలో కూడా వ్యతిరేకించడం సరికాదన్నారు. మనమే జీఓలు ఇచ్చి వ్యతిరేకించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం మంచి పనులు చేసినప్పుడు హర్షించాలని, చెడుగా వ్యవహరించినప్పుడు వ్యతిరేకించాలన్నారు.

బాధ్యతారాహిత్యంగా సీఎం వ్యాఖ్యలు

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి



సూర్యాపేట టౌన్: మూసీ సుందరీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజల పరువు పోయేలా రేవంత్ ఉపన్యాసాలు ఉన్నాయన్నారు. ఎవరో రాసిచ్చిన పాఠం చదవడం రేవంత్ మానేస్తే మంచిదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయం పెంచింది కేసీఆర్ అని, 2014 బడ్జెట్, ఇప్పటి బడ్జెట్ చూస్తే ఎవరు ఆదాయం పెంచారో తెలుస్తుందని చెప్పారు. కనీసం కేసీఆర్ ఇచ్చిన పథకాలైనా ఇస్తే చాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. సెక్యూరిటి లేకుండా సీఎం మూసీ ప్రాంతంలో తిరిగి చూపించాలన్నారు. మూసీ కూల్చివేతల తరువాత సెక్యూరిటీ పెంచుకుని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. అశోక్‌నగర్ నిరుద్యోగుల వల్లే రేవంత్‌కి అధికారం వచ్చిందని, ఇప్పుడు అశోక్‌నగర్ పేరు వింటే రేవంత్‌కి భయమేస్తోందన్నారు. యువత ఆవేశం ఇలానే కొనసాగితే తెలంగాణ మొత్తం అశోక్‌నగర్‌లే అవుతాయన్నారు.

పిడుగుపడి మేకలు, గొర్రెలు మృతి

వేములపల్లి (మాడ్గులపల్లి): పిడుగుపాటుకు గురై నాలుగు మేకలు మృతిచెందిన సంఘటన మాడ్గులపల్లి మండలంలోని అబంగాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు బోయ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీగా తమ మేకలను మేత కోసం గ్రామ శివారులోకి తీసుకెళ్లగా అకస్మాత్తుగా వర్షం రావడంతో పిడుగు పడి నాలుగు మేకలు మృతిచెందాయి. మేకలే తనకు జీవనాధారమని తనకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

నేరేడుచర్ల మండలంలో 39 గొర్రెలు..

నేరేడుచర్ల: పిడుగు పడి 39 గొర్రెలు మృతి చెందాయి. ఈ ఘటన శుక్రవారం నేరేడుచర్ల మండలం బోడలదిన్నె గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మల్లెపూల లింగయ్య, యాలకాని ఆంజనేయులు శుక్రవారం గ్రామ శివారులో పొలాల వద్ద దాదాపు 300 గొర్రెలను మేపుతున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తూ పిడుగు పడింది. దీంతో ఆ గొర్రెల మందలో 39 గొర్రెలు మృతి చెందినట్లు బాధితులు తెలిపారు.

గరిడేపల్లి మండలంలో గేదె..

గరిడేపల్లి: పిడుగు పడి గేదె మృతి చెందిన సంఘటన గరిడేపల్లి మండల పరిధిలోని సోమ్లాతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాలోని గుగులోతు పూల్‌సింగ్, బీచానాయక్‌కు చెందిన గేదెను ఇంటివద్ద కట్టేశారు. ఈ సమయంలో వర్షం రావడంతోపాడు సమీపంలో పిడుగు పడడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ. 50 వేలు ఉంటుందని రైతులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

జనావాసాల మధ్య పిడుగు కలకలం


మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో పిడుగుపాటుకు దెబ్బతిన్న ఇంటి పైకప్పు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని శాంతినగర్‌లో శుక్రవారం జనావాసాల మధ్య పిడుగు పడడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఉరుములు మెరుపులతో ఒక్కసారి భారీ శబ్దంతో శాంతినగర్‌లోని బొల్ల లక్ష్మీనారాయణ ఇంటిపై పిడుగు పడింది. దీంతో రేకులు, గోడ పగిలి ఇంట్లోని దేవుడి మందిరంపై పడ్డాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో గండం గడిచింది. ఆ పరిసరాల్లో సుమారు 50 ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ ఉదయ్ భాస్కర్ బాధితులను పరామర్శించారు.

బోల్తా కొట్టిన కారు

- సురక్షితంగా బయటపడిన ముగ్గురు వ్యక్తులు

నల్లగొండ క్రైం : అద్దంకి–నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై నల్లగొండ పట్టణ శివారు మర్రిగూడ బైపాస్‌లో హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు శుక్రవారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జవగా, అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. వివరాలు.. తమిళనాడు నుంచి కంచిపట్టు చీరలతో ముగ్గురు వ్యక్తులు హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో మర్రిగూడ బైపాస్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే బెంజ్ కారు మట్టి దిబ్బలు ఎక్కి మూడు పల్టీలు కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న రాజేష్ షా, అశ్విని షా, డ్రైవర్ ప్రశాంత్ ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో ఎలాంటి గాయం కాలేదు. కారు బోల్తా పడిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న వారికి బ్రిడ్జి నిర్మాణ పనులు కనిపించకపోవడం, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రదేశం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

హలాల్ నిషేధం అంటూ ఫ్లెక్సీ..


మేకలు, కోళ్లు కోసే ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ కొండకు దిగువ ఉన్న పాదాల చెంత భక్తులు మేకలు, కోళ్లు కోసి మొక్కులు తీర్చుకుంటారు. ఈ క్రమంలో ఇక్కడ మేకలు, కోళ్లను కొందరు వ్యక్తులు హలాల్ చేస్తున్నారని, దీనిని అరికట్టాలని కోరుతూ ఈఓ భాస్కర్‌రావుకు స్థానికులు ఈ నెల 17వ తేదీన వినతిపత్రం అందజేశారు. దీంతో అక్కడ హలాల్ నిషేధం, హలాల్ చేసిన మేకను, కోడిని నైవేద్యంగా పెట్టకూడదు అంటూ మటన్ కొట్టేవారు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

95 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పాలకవీడు: రేషన్ బియ్యంతో పోలీసులు

పాలకవీడు: ఉమ్మడి జిల్లాలోని వివిధ చోట్ల 95 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. 60 క్వింటాళ్లు.. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ లక్ష్మీనర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాల తనిఖీల్లో భాగంగా పాలకవీడు మండల పరిధిలోని యల్లాపురం గ్రామం నుంచి జాన్‌పహాడ్–నేరేడుచర్ల ప్రధాన రహదారి వైపు వస్తున్న రెండు ట్రాక్టర్లలో 60 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బస్తాల్లో నింపి తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్లను విచారించగా గుడుగుంట్లపాలెం, ముసిఒడ్డు సింగారం, యల్లాపురం గ్రామాల నుంచి బియ్యం లోడ్ చేసుకుని వస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లు గరిడేపల్లి మండలానికి చెందినవిగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నామని ఎస్‌ఐ వివరించారు.

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని శాంతినగర్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్‌లో కిరాణా షాపు నిర్వహిస్తున్న చెదురుకుపల్లి సైదులు.. ఆటోలోకి 10 బస్తాల(5 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని ఎక్కిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కిరాణాషాపు యాజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జున పేర్కొన్నారు.

చింతలపాలెంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : అక్రమంగా నిల్వ ఉంచి తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న సంఘటన చింతలపాలెం మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం గుడిమల్కాపురం గ్రామంలోని పులి గోపి ఇంట్లో అక్రమంగా 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ ఉంచారు. ఆ రేషన్ బియ్యాన్ని ఓ వాహనంలో వేసి డ్రైవర్ ఖాసీం తరలించేందుకు సిద్ధంగా ఉన్నారనే సమాచారం రావడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో వెళ్లి ఆ వాహనాన్ని పట్టుకున్నారు. పంచనామా నిర్వహించి వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. వారి ఫిర్యాదు మేరకు నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పుస్తక పఠనంతో వ్యసనాలకు దూరంగా ఉండొచ్చు


జూలూరు పథం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

- తెలంగాణ స్టేట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు

కోదాడ రూరల్: పుస్తక పఠనంతో చెడు వ్యసనాలకు దూరంగా ఉండొచ్చని తెలంగాణ స్టేట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో ప్రముఖ కవి జూలూరు గౌరీశంకర్ రచించిన ఆత్మకథనాత్మక దీర్ఘకావ్యం 'జూలూరు పథం'అనే గ్రంథాన్ని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 94 గ్రంథాలయాలకు బహూకరించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బాణోతు బాలమ్మకు జూలూరు పథ 200 గ్రంథాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పల్లెల్లో గ్రంథాలయాలను ఎంతగా అభివృద్ధి చేస్తే సమాజం అంత ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్ మాట్లాడుతు నడిగూడెం జమిందారు రాజా నాయిని వెంకటరంగారావు తెలుగు భాషాభివృద్ధికి కృషి చేశారన్నారు. అదే నడిగూడెంలో పుట్టిన జూలూరు గౌరీశంకర్ 300 పుస్తకాలను రచించి అస్తిత్వ ఉద్యమ సాహిత్యాన్ని వెలువరించారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు, రాయపూడి చిన్ని, పార సీతయ్య, సీహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, ముత్తవరపు పాండురంగారావు, బద్దం భద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ పంపుసెట్ల చోరీ ముఠా అరెస్ట్

- వ్యవసాయ పొలాల వద్ద పంపుసెట్లు చోరీ

కనగల్: రాత్రి వేళల్లో ఆటోలో తిరుగుతూ పొలాల వద్ద రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ పంపుసెట్ల చోరీకి పాల్పడుతున్న దొంగల ముఠాను కనగల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం కనగల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ విష్ణుమూర్తి సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కనగల్ గ్రామానికి చెందిన పగిడిమర్రి రాంబాబు, కసిరే నగేష్, మహమ్మద్ రఫీ, నక్క శివ, షేక్ సత్తార్ అనే వ్యక్తులు ముఠాగా ఏర్పడి కొద్దికాలంగా రాత్రి వేళల్లో ఆటోలో తిరుగుతూ కనగల్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని పొలాల వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న బోరు మోటార్లను గుట్టుచప్పుడు కాకుండా అపహరించి నల్లగొండ తదితర ప్రాంతాలకు తరలించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం కనగర్ నుంచి నలగొండకు వెళ్తున్న వీరి ఆటోను పోలీసులు తనిఖీ చేయగా అందులో విద్యుత్ మోటార్లు కనిపించారు. పోలీసులు వారిని ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పకపోవడంతో స్టేషన్‌కు తరలించి విచారించగా విద్యుత్ మోటార్ల దొంగతనం బయటకు వచ్చింది. దీంతో కేసు నమోదు చేసి రాంబాబు, నగేష్, రఫీలను రిమాండ్‌కు తరలించారు. మిగతా నిందితులు నక్క శివ, షేక్ సత్తార్ పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆటోతోపాటు మోటార్లను సీజ్ చేసినట్లు వివరించారు.

వలంటీర్లను అభినందించిన రిజిస్ట్రార్

నల్లగొండ రూరల్ : హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో ఈ నెల 22 నుంచి 31 వరకు నిర్వహించనున్న జాతీయ సమైక్యత శిబిరాలకు ఎంపికైన వలంటీర్లను మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఏ రవి, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ మద్దిలేటి శుక్రవారం ఎంజీయూలో అభినందించారు. యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను వారు కోరారు.

సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో పెదనెమిల విద్యార్థులు


సౌత్ ఇండియా సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో విద్యార్థుల ప్రదర్శన

నూతనకల్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ డ్రామా ఫెస్టివల్–2024లో నూతనకల్ మండల పరిధిలోని పెదనెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్‌లో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. శుక్రవారం సౌత్ ఇండియా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో వారు పాల్గొన్నారు. చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి అనే అంశంపై కళారూపం ద్వారా ప్రదర్శన నిర్వహించారు. సౌత్ ఇండియా స్థాయిలో విద్యార్థులు ప్రాతినిధ్యం వహించడంపై హెచ్‌ఎం ధరావత్ శివయ్య, ఉపాధ్యాయులు చవగాని వెంకటయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


మృతిచెందిన మిర్యాల కౌసల్య

నార్కట్‌పల్లి : బంధువు అంత్యక్రియలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయిపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన మిర్యాల కౌసల్య(60), అదే గ్రామానికి చెందిన మోసం రామస్వామి–అన్నపూర్ణ దంపతులతో కలిసి ద్విచక్ర వాహనంపై కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో గోపలాయిపల్లి వద్ద డివైడర్ దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు డ్రైవర్ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చికిత్స నిమి త్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ముగ్గురిని కుటుంబ సభ్యులు హైదరాబాదులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కౌసల్య మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వాచ్‌మెన్ ..

యాచారం: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వాచ్‌మన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా దేవరకొండకు చెందిన తుపాకుల మల్లేశ్ (40) యాచారం మండల పరిధిలోని నందివనపర్తిలో ఉన్న ఓ ప్రైవేట్ వెంచర్‌లో కొన్నాళ్లుగా వాచ్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వ్యక్తిగత పనిమీద శుక్రవారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై నక్కర్తమేడిపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో పిల్లిపల్లి గ్రామ సమీపంలోని మలుపు వద్ద తాడిపర్తి గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో చేనేత కార్మికుడు..

నకిరేకల్ : విద్యుదాఘాతంతో చేనేత కార్మికుడు మృతిచెందిన సంఘటన నకిరేకల్‌లోని పద్మానగర్‌లో శుక్రవారం చోటుచేసుంది. వివరాలు.. నకిరేకల్ పట్టణంలోని 9వ వార్డుకు చెందిన ముదుదుడ్ల శంకరయ్య(66) అనే వ్యక్తి పద్మానగర్ జంక్షన్ వద్ద తన కున్న కొద్దిపాటి స్థలంలో ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇంటి నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. పై అంతస్తులో విద్యుత్ బోర్డును సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై శంకరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో శంకరయ్యను ఎవరూ చూడలేదు. మధ్యాహ్నం సమయంలో వారి కుటుంబీకులు వచ్చి చూసేసరికి శంకరయ్య ప్రాణాలు కోల్పోయి ఉన్నాడు. అనంతరం శంకరయ్య మృతదేహన్ని వారు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటికి తరలించారు.

కల్తీ వస్తువుల తయారీ కేంద్రంపై దాడి

మోత్కూర్ : మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి నకిలీ వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పద్మశాలి కాలనీకి చెందిన దుడుక సోమరాజు ఎలాంటి అనుమతి లేకుండా సింథటిక్ కలర్స్‌తో అల్లం పేస్ట్, కారం, పసుపు తయారు చేస్తున్నారనే సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు అతడి ఇంటిపై దాడి చేశారు. 125 సింథటిక్ కలర్స్ డబ్బాలు, 263 అల్లం పేస్ట్ డబ్బాలు, 50 కిలోల పసుపు, 5 కిలోల కారం అతడి నుంచి స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు తెలిసింది. గతంలో మోత్కూర్‌లో కల్తీ నూనెలతో తిను బండారాలు తయారు చేస్తున్న కేంద్రాలపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేశారు. తాజా దాడులతో కల్తీ వస్తువులకు మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రాన్ని అడ్డాగా మార్చుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.